
సాక్షి విజయనగరం

గురువారం । 10 । జూలై । 2025



'తారకరామ'కు మోక్షమెప్పుడో?

రెండు దశాబ్దాలుగా సాగుతున్న ప్రాజెక్టు తారక రామ తీర్థసాగర్. దీని అంచనా వ్యయం పెరుగుతోందే తప్ప పనులు పూర్తి కావడం లేదు.

- 4లో



మత్స్యకారుల హాహాకారాలు

మడ్డువలస ప్రాజెక్టులో చేపల వేటకు వెళ్లిన ఇద్దరు మత్స్యకారులు గుర్రపుడెక్కలో చిక్కుకున్నారు.

- 4లో



అగ్నిప్రమాదంపై ఫైర్ ఆడిట్

అడ్డూరువానిపాలెం గ్రామం సమీపంలోని కేజీబీవీలో మంగళవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంపై నివేదిక అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు.

- 4లో

న్యూస్‌రీల్

గ్రంథాలయాల అభివృద్ధికి చర్యలు

- జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్



గ్రంథాలయ సంస్థ బడ్జెట్‌ను వివరిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.లక్ష్మి

విజయనగరం అర్బన్: జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్, జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జి ఎస్.సేతమాధవన్ ఆదేశించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ బడ్జెట్ సమావేశం జేసీ చాంబర్‌లో బుధవారం నిర్వహించారు. పౌర గ్రంథాలయ శాఖ డైరెక్టర్ సూచనలు, కేటాయించిన బడ్జెట్‌కు అనుగుణంగా త్వరలో జరగబోయే సర్వసభ్యసమావేశం గురించి, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తీసుకోవాల్సిన చర్యలు, నిధులు కేటాయింపుపై సమావేశంలో చర్చించారు. ఆన్ డిమాండ్ పుస్తకాల కోసం రూ.3 లక్షలు, బిల్డింగ్ నిర్మాణానికి రూ.50 లక్షలు, ఇతర పుస్తకాల కొనుగోలుకు రూ.లక్ష కేటాయిస్తున్నట్టు జేసీ ప్రకటించారు. దీనిని కమిటీ సభ్యులు ఆమోదించారు. సమావేశంలో వయోజనవిద్యాశాఖ ఇన్‌చార్జి డీడీ సుబ్రహ్మణ్యం, ఇన్‌చార్జి డీపీఆర్‌ఓ ఎం.మల్లేశ్వరరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.లక్ష్మి, డివిజనల్ పంచాయతీ అధికారి శిరీష పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు జీతాలేవీ?



విలేకరులతో మాట్లాడుతున్న రామారావు

రాజాం సిటీ: నెలలో 9 రోజులు గడిచాయి.. ఇప్పటికీ చాలా మంది ఉపాధ్యాయులకు జీతాలు అందలేదని బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేకేటి రామారావు అన్నారు. స్థానిక విలేకరులతో ఆయన బుధవారం మాట్లాడుతూ పాత జిల్లాల ప్రాతిపదికన గత నెలలో బదిలీ అయిన ఉపాధ్యాయులకు ఇప్పటివరకు జీతాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. కేడర్ స్ట్రెంత్ అప్‌డేట్ చేసే సాంకేతిక సమస్యను ట్రెజరీ అధికారులు పరిష్కరించేవిధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టి జీతాలు త్వరితగతిన అకౌంట్‌కు జమయ్యేలా చూడాలని కోరారు. జీతాలు అందకపోవడంతో ఆర్థిక కష్టాలు వెంటాడుతున్నాయని, ఈఎంఐలు చెల్లించేందుకు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వెంట బీటీఏ జిల్లా నాయకులు అనిల్‌తండాడి, నాస సింహాచలం ఉన్నారు.

11న ఏపీ ఎన్‌జీఓ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల రాక

విజయనగరం అర్బన్: ఏపీ ఎన్‌జీఓ రాష్ట్ర అధ్యక్షుడిగా, జేఏసీ చైర్మన్‌గా ఎన్నికైన విద్యాసాగర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జేఏసీ డిప్యూటీ సెక్రటరీ జనరల్‌గా ఎన్నికైన డీవీరమణ ఈ నెల 11న తొలిసారి జిల్లాకు రానున్నారని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.శ్రీధర్‌బాబు, సురేష్, సహ అధ్యక్షులు జీవీఆర్‌ఎస్ కిశోర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారికి వై జంక్షన్‌లో ఘన స్వాగతం పలుకుతామన్నారు. అక్కడి నుంచి జెడ్పీ కార్యాలయం వరకు బైక్ ర్యాలీతో స్వాగతిస్తామని చెప్పారు. మధ్యాహ్నం జెడ్పీ సమావేశ మందిరంలో జిల్లా, తాలూకా యూనిట్ కార్యవర్గం, జేఏసీ మిత్ర సంఘాల కార్యవర్గంతో సమావేశం నిర్వహించి అనంతరం ఘనంగా సత్కరిస్తామని తెలిపారు. కార్యక్రమానికి జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, యూనిట్ కార్యవర్గ సభ్యులు హాజరుకావాలని కోరారు.

ఉపాధి కల్పనే ధ్యేయం



వెంకటేశ్వరరావు

విజయనగరం టౌన్: షెడ్యూల్ కులాలకు సంబంధించిన నిరుద్యోగ యువ తీ, యువకులకు ఉపాధికల్పనే ధ్యేయంగా కార్పొరేషన్ పనిచేస్తోందని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. తన కార్యాలయంలో బుధవారం మాట్లాడుతూ విజయనగరం జిల్లాకు సంబంధించి 509 మందికి వివిధ యూనిట్ల ఏర్పాటుకు రుణాలు అందించేందుకు రూ.21కోట్ల13 లక్షలు మంజూరయ్యాయని, వీటికి నాలుగువేల మంది దరఖాస్తు చేశారన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో 266 యూనిట్ల ఏర్పాటుకు రూ.11కోట్ల 2 లక్షల75 వేలు మంజూరుకాగా, 1800 మందికి దరఖాస్తు చేసుకున్నారన్నారు. అయితే, ఇప్పటి వరకు 32 యూనిట్లకు అర్హులను ఎంపిక చేసినట్టు తెలిపారు. అభ్యర్థులు తమ అర్హతలకు సంబంధించిన ధ్రువపత్రాలను భద్రపర్చుకోవాలని సూచించారు.

- లేబర్ కోడ్‌లు రద్దుచేయాలని డిమాండ్
- ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై నిరసన
- జిల్లా వ్యాప్తంగా నిరసన ర్యాలీలు, మానవహారాల నిర్వహణ
- విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొన్న చిరుద్యోగులు
- కనీస వేతనం అమలుకు డిమాండ్

కదంతొక్కిన కార్మిక, కర్షకలోకం



మూడు లాంతర్లు నుంచి ఎంజీ రోడ్డు మీదుగా కార్మికుల ర్యాలీ

విజయనగరం గంటస్తంభం:

ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా కార్మిక, కర్షక, ఉద్యోగ వర్గాలు కదంతొక్కాయి. నిరసన గళం వినిపించాయి. లేబర్ కోడ్‌లు రద్దుచేయాలంటూ నినదించాయి. భారీ ర్యాలీలు, మానవహారాలు నిర్వహించాయి. విధులు బహిష్కరించి దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో బుధవారం భాగస్వాములయ్యాయి. సమ్మెను విజయవంతం చేయడంలో వివిధ రంగాలకు చెందిన కార్మికులు, చిరుద్యోగులు, బ్యాంకు ఉద్యోగులు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మిక, రైతు, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం బ్యాంకింగ్, కోల్, రైల్వే, పోస్టల్, స్టీల్, బీమా వంటి కీలక రంగాల్లో ప్రైవేటీకరణను ప్రోత్సహించడం విచారకరమన్నారు. ఇది భవిష్యత్‌లో నిరుద్యోగితను పెంచుతుందని, ఉద్యోగ భద్రత లేకుండా చేస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. కార్మికులకు కనీస దినసరి కూలీ రూ.670గా ఉండాల్సిందేనని ఆర్థికవేత్తల నివేదికలు తేల్చి చెప్పగా.. వాటన్నింటినీ కాదని కనీస వేతనం రూ.178గా నిర్ధారిస్తూ పార్లమెంటులోని పెద్దలందరూ చప్పట్లు కొట్టి చట్టం చేయడం విచారకరమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బారావమ్మ, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఎ.జగన్మోహన్ రావు, సీపీఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్, జిల్లా రైతు సంఘం కార్యదర్శి బి.రాంబాబు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య, అంగన్‌వాడీ ఉద్యోగులు, ఆశ కార్యకర్తలు, చిరుద్యోగులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



విజయనగరంలో అంగన్వాడీ, ఆశ కార్యకర్తల మానవహారం



విజయనగరం చిన్న వీధి కూడలి వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ర్యాలీ



పెద్ద చెరువు గాంధీ విగ్రహం వద్ద బ్యాంకు ఉద్యోగుల నిరసన

డిమాండ్లు ఇవీ..



- నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణం రద్దుచేయాలి.
- అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనంగా రూ.26వేలు చెల్లించాలి.
- బ్యాంకులు, బీమా, ప్రభుత్వ కంపెనీలను ప్రైవేటుపరం చేయడాన్ని నిలువరించాలి.
- ఆశ, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులు, శానిటరీ, వీఏవో, ఆర్పీలకు ఉద్యోగ భద్రత కల్పించాలి.
- కాంట్రాక్టు, పొరుగు సేవల సిబ్బందిని పర్మినెంటు చేయాలి.
- ఆటో, మోటారు, ముఠా కలాసీలు, భవన నిర్మాణ కార్మికులు, చిల్లర వర్తకులకు పీఎఫ్, ఈఎస్ఐ వంటి సమగ్ర పథకాలు అందించాలి.
- మోటారు సవరణ చట్టం 2019ని రద్దు చేయాలి. బీఈపీఎస్ కనీస పింఛన్ రూ.9వేలు ఇవ్వాలి.
- స్థానికులకు 75 శాతం ఉపాధి అవకాశాలు కల్పించాలి.
- కేంద్రం, రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల ఖాళీలను భర్తీచేయాలి.

వ్యవసాయశాఖ మంత్రి ఉన్నా ప్రయోజనం శూన్యమే..

రాజాం:



జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రిగా కింజరాపు అచ్చెన్నాయుడు కొనసాగుతున్నా ఉత్తరాంధ్ర రైతులకు విత్తన, ఎరువు, సాగునీటి కష్టాలు తప్పడంలేదని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆరోపించారు. రాజాంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు విత్తనాలు, ఎరువులను ప్రభుత్వం సరఫరా చేయకుండా బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తోందని విమర్శించారు. వ్యవసాయ శాఖ మంత్రి మాత్రం రైతులు సుభిక్షంగా ఉన్నారని అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గిట్టుబాటు ధర లేక మామిడిపండ్లను రైతులు రోడ్లమీద పడేస్తే ఏపీ ప్రభుత్వం పట్టించుకోలేదని, పక్కనే ఉన్న కర్ణాటక ప్రభుత్వం మాత్రం రాయితీ ఇచ్చి రైతులకు అండగా నిలిచిందని పేర్కొన్నారు. జిల్లాలో చెరకు ఫ్యాక్టరీ ఎత్తివేసే పరిస్థితి వస్తే డీఆర్‌సీ సమావేశంలో నిలదీయడంతో ఆ పరిస్థితి నుంచి తప్పుకుని పత్రికా ప్రకటన చేశారని, కనీసం రైతులను పట్టించుకోని మంత్రి వ్యవసాయశాఖ మంత్రిగా ఉండడం మన దురదృష్టకరమని విమర్శించారు. రెండేళ్లుగా రైతు భరోసా వేయలేని మంత్రి ఏమని ప్రెస్‌మీట్‌లు పెడుతున్నారో అర్థంకావడంలేదన్నారు.

పోస్టుకార్డు ఉద్యమం



జిందాల్ స్వాధీనం చేసుకున్న భూములను తిరిగి నిర్వాసిత రైతు కుటుంబాలకు అప్పగించాలని కోరుతూ బొడ్డవరలో జిందాల్ నిర్వాసితులు బుధవారం పోస్టు కార్డు ఉద్యమం చేపట్టారు. తమకు జరుగుతున్న అన్యాయాన్ని ఉత్తరాల్లో రాసి మానవహక్కుల కమిషన్‌కు పంపించారు.

- ఎస్.కోట

సచివాలయాల్లో అక్రమ బదిలీలు!



కలెక్టరేట్ ఎదుట నిరసనలో సచివాలయ మహిళా పోలీసులు

'ఓ సచివాలయ అగ్రికల్చర్ సెక్రటరీకి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం తను కోరుకున్న మెంటాడ మండలంలోని ఓ సచివాలయానికి బదిలీ చేస్తూ ఆదివారం రాత్రి తొలి బదిలీ జాబితా విడుదల చేశారు. ప్రస్తుతం ఉన్న స్థానం నుంచి రిలీవింగ్ తీసుకోవడం ఆలస్యం కావడంతో మంగళవారం వరకు బదిలీ స్థానంలో బాధ్యతలు స్వీకరించలేదు. ఇంతలోనే మంగళవారం మరో బదిలీ జాబితా వచ్చింది. ఇంకా జాయిన్ అవ్వని మెంటాడ మండలం నుంచి మరో మండలానికి బదిలీ అయినట్టు ఆదేశాలొచ్చాయి.' ఇలా జిల్లాలోని 34 మందికి బదిలీ ఆదేశాలొచ్చాయి. వీరంతా బుధవారం కలెక్టరేట్‌కు చేరుకుని తమకు జరిగిన అన్యాయంపై ఆందోళన చేశారు. న్యాయం చేయాలని కోరారు. అనంతరం వ్యవసాయశాఖ జేడీ తారకరామారావుకు వినతి పత్రాన్ని అందజేశారు.

విజయనగరం అర్బన్: గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది బదిలీల్లో నిబంధనలకు పాతరేస్తున్నారు. అధికార పార్టీ జోక్యం మితిమీరింది. ప్రజాప్రతినిధుల ఒత్తిడికి అధికారులు తలొగ్గుతూ అక్రమ, అకారణ బదిలీల్లో హద్దులు దాటారాని సచివాలయ ఉద్యోగులు విమర్శిస్తున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలు పాటించకపోవడంపై అభ్యంతరం తెలుపుతున్నారు. ఆందోళనలు చేస్తున్నారు. వ్యవసాయ శాఖ పరిధిలోని 330 మందికి ఇటీవల బదిలీ ప్రక్రియ చేపట్టారు. వీరిలో 34 మంది బదిలీలపై జిల్లాకు చెందిన మంత్రి, ఎమ్మెల్యేల ఒత్తిడి పడింది. ఈ ఒత్తిడిని జిల్లా యంత్రాంగం తొలుత పట్టించుకోలేదు. మార్గదర్శకాల మేరకు అర్హులైన వారిని కోరుకున్న స్థానాలకు బదిలీ చేస్తూ తొలి బదిలీ జాబితాను ప్రకటించినట్టు చెబుతున్న అధికారులు, రెండో జాబితా అంటూ విడుదల చేసిన 34 మందికి స్థానచలనానికి స్పష్టత ఇవ్వడం లేదు.

అర్హతలేని వారికి బదిలీ ప్రాధాన్యం

నిబంధనల మేరకు కనీసం రెండేళ్ల సర్వీసు

- నిబంధనలకు పాతర
- రెండురోజుల్లో రెండో బదిలీ జాబితా విడుదల
- ఇంకా జాయిన్ అవ్వని స్థానం నుంచి బదిలీ ఆర్డర్లు
- అర్హత లేని వారికి బదిలీలో ప్రాధాన్యం
- ఆందోళనలో ఉద్యోగులు

పూర్తికాని మెంటాడ మండలంలోకి ఒక డిజిటల్ అసిస్టెంట్‌కి రాజకీయ ఒత్తిడితో తను కోరుకున్న డెంకాడ మండలానికి అక్రమంగా బదిలీ చేశారు. విజయనగరం మండలం స్పౌజ్ అర్హత ఉన్న మరో డిజిటల్ సెక్రటరీని విజయనగరం మండలం, సమీప మండలానికి వేయకుండా దూర ప్రాంతానికి బదిలీచేస్తూ ఆదేశాలిచ్చారు'. ఇలా సచివాలయ సర్వే, సంక్షేమ, మహిళా పోలీస్ సిబ్బందికి బదిలీల్లో తీరని అన్యాయం జరిగింది. ప్రభుత్వ ఉత్వర్వుల ప్రకారం, రెండేళ్ల సేవాకాలాన్ని పూర్తిచేసిన ఉద్యోగులకే బదిలీ అవకాశం ఉండాలి. కొన్నిచోట్ల 1.5 ఏళ్లలోనే కొందరిని బదిలీ చేయడం, మరికొందరు 4 ఏళ్లుగా అదే చోట పనిచేస్తున్నా బదిలీ చేయకపోవడం అనుమానాలకు తావిస్తోంది. రాజకీయ ఒత్తిళ్లు, కొందరి ఆదేశాలతో సిఫారసుల ఆధారంగా బదిలీలు జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వినతులు పట్టించుకోని అధికారులు

ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్ పోర్టల్ ద్వారా అప్‌లై చేసిన తర్వాత సిబ్బంది ఇచ్చిన అభ్యంతరాలను, కుటుంబ పరిస్థితులను, వైద్య సమస్యల ఆధారంగా ఇచ్చిన విజ్ఞప్తులను సంబంధిత శాఖ అధికారులు పెద్దగా పరిగణలోకి తీసుకోవలేదని బాధితులు చెబుతున్నారు. 'తమ కుంటుంబ పరిస్థితులే కాదు పిల్లల చదువులు, సంరక్షణతోపాటు ఆరోగ్య సమస్యలను కూడా అధికారులు పట్టించుకోలేదని' ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తెలిపారు.

మహిళా పోలీసుల ఆందోళన

సచివాలయాల పరిధిలోని 600 మంది మహిళా సంరక్షణ పోలీసులకు బదిలీ ప్రక్రియలో స్థానచలనం కలిగింది. వీరిలో 300 మంది వరకు మిగులు పోస్టులు కావడంతో డిప్యుటేషన్‌పై వేరొక శాఖకు పంపే ఆదేశాలిచ్చారు. మరోవైపు స్పౌజ్ అభ్యర్థులు 150 మంది వరకు ఉండడంతో మిగిలిన వారికి దూరప్రాంతాలకు బదిలీలు జరిగాయి. డిప్యుటేషన్ ప్రక్రియను వ్యతిరేకిస్తూ ఏపీ విలేజ్ వార్డు సెక్రటేరియట్ మహిళా పోలీసు ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా సంఘం ఆధ్వర్యంలో బుధవారం మహిళా పోలీసులు కలెక్టరేట్‌కు వచ్చి నిరసన చేపట్టారు. అనంతరం డీఆర్వోకు వినతిపత్రం అందజేశారు.

నేడు జిల్లా పేరెంట్స్ టీచర్స్ మీట్

విజయనగం అర్బన్:

ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లో జిల్లా వ్యాప్తంగా గురువారం పేరెంట్స్ టీచర్స్ మీట్‌ను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బుధవారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 2,232 పాఠశాలల నుంచి 2,10,377 మంది విద్యార్థులు, 180 జూనియర్ కళాశాల నుంచి 38,478 మంది విద్యార్థులు వారి తల్లి దండ్రులతో కలిసి హాజరవుతారన్నారు.

- గజపతినగరం ఏరియా ఆస్పత్రిలో తప్పని అవస్థలు
- జ్వరాల వ్యాప్తితో ఆస్పత్రికి రోగుల తాకిడి

ఒక్కో బెడ్‌పై ఇద్దరు రోగులకు వైద్యం



గజపతినగరం ఏరియా ఆస్పత్రిలో సేవలు పొందుతున్న రోగులు

ఆస్పత్రిలో బెడ్‌లు ఇలా..	
మెడికల్ వార్డులో	35
గైనిక్ వార్డులో	13
క్యాజువాల్టీలో వార్డులో	03
ఆస్పత్రి వరండాలో	03
ఫిజియోథెరపీ రూంలో	01
ఆపరేషన్ థియేటర్‌లోని బెడ్	01
మొత్తం బెడ్‌లు	56

గజపతినగరం రూరల్:

గతంలో ఎన్నడూ చూడని విధంగా జిల్లాలో జ్వరాలు వ్యాప్తిచెందుతున్నాయి. ఆస్పత్రులకు జ్వరపీడితుల తాకిడి పెరిగింది. ఓపీ పెద్ద సంఖ్యలో నమోదవుతోంది. ఇన్‌పేషెంట్ల సంఖ్య పెరుగుతోంది. ఆస్పత్రుల్లో బెడ్‌లు చాలడం లేదు. ఒక్కో బెడ్‌పై ఇద్దరుముగ్గురికి వైద్యసేవలు అందించాల్సిన పరిస్థితి నెలకొంది. దీనికి గజపతినగరం ఏరియా ఆస్పత్రిలో సేవల తీరే నిలువెత్తు సాక్ష్యం. ఇక్కడ బెడ్‌లు 56 ఉండగా ఇన్‌పేషెంట్లు 79 మంది ఉన్నారు. చేసేదిలేక ఒక్కో బెడ్‌పై ఇద్దరిని ఉంచి వైద్యసేవలు అందిస్తున్నారు.

అందుబాటులోకి రాని భవనం

గజపతినగరం నియోజకవర్గ కేంద్రంలోని ఏరియా ఆస్పత్రి మెంటాడ, దత్తిరాజేరు, బొండపల్లి, గజపతినగరం మండలాల్లోని 120 గ్రామాల ప్రజల వైద్యసేవలకు ఆధారం. దీని ప్రాధాన్యతను గుర్తించిన గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 100 పడకలకు స్థాయి పెంచుతూ రూ.17కోట్లు మంజూరు చేసింది. భవన నిర్మాణాన్ని సుమారు 85 శాతం మేర పూర్తి చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఆస్పత్రి మిగులు పనులపై శ్రద్ధచూపలేదు. ఫలితం రోగులకు వైద్యకష్టాలు తప్పడంలేదు. వరండాల్లోను, ఒక్కో బెడ్‌పై ఇద్దరు చొప్పున ఉంటూ వైద్యసేవలు పొందాల్సి వస్తోంది. ఇదే విషయాన్ని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి జీవనరాణి వద్ద 'సాక్షి' ప్రస్తావించగా వంద పడకల ఆస్పత్రి అందుబాటులోకి వచ్చేవరకు రోగులకు ఇబ్బందులు తప్పవన్నారు.







గజపతినగరం ఏరియా ఆస్పత్రిలో ఒక్కోబెడ్‌పై ఇద్దరుముగ్గురు రోగులకు సేవలిలా..

క్లుప్తంగా

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

• మరొకరికి గాయాలు


నాగేష్ (ఫైల్)

భామిని: మండలంలోని డోకుల గూడకు చెందిన గిరిజనుడు కొండగొర్రి నాగేష్(49)బుధవారం బైక్ అదుపుతప్పడంతో జరిగిన ప్రమాదంలో మృతి చెందాడు. భామిని నుంచి డోకులగూడ వైపు వెళ్తుండగా ఏబీ రోడ్డుపై ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడిపోగా సంఘటనా స్థలంలోనే మృత్యువాత పడ్డాడని బత్తిలి పోలీసులు తెలిపారు. గుమ్మలక్ష్మీపురం మండలంలోని నేలమానుగూడలో అత్తవారింటికి వెళ్లివస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఇదే ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ఉన్న మరో యువకుడు బిడ్డిక సంజీవ్ తీవ్రగాయాలతో ఆస్పత్రి పాలయ్యాడు. భామిని పీహెచ్‌సీలో ప్రాథమిక వైద్య సేవలు అందించి 108 అంబులెన్స్‌పై పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య లలిత ఫిర్యాదు మేరకు బత్తిలి ఏఎస్సై కొండగొర్రి కాంతారావు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడిన శంకరరావు

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని కుందరతిరువాడ గ్రామానికి చెందిన గుగ్గిలాపు శంకరరావు(26) బుధవారం ఉదయం సుమారు 3 గంటల సమయంలో విశాఖపట్నంలో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొంత కాలం క్రితం శంకరరావు తన భార్య హేమతో కలిసి విశాఖపట్నానికి బతుకు తెరువు కోసం వెళ్లి అక్కడే ఉంటున్నాడు. అయితే శంకరరావు ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదు. మృతుడికి ఇద్దరు పిల్లలు, తండ్రి రామిశెట్టి, తల్లి సావిత్రమ్మ, అక్క, అన్నయ్య ఉన్నారు.

ఉరివేసుకుని మరో వ్యక్తి..

భోగాపురం: మండలంలోని దల్లిపేట గ్రామంలో మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన దల్లి అప్పలరెడ్డి(38)కి వివాహమై సుమారు 15 ఏళ్లు అవుతోంది. భార్య ఎర్రమ్మ, ఒక పాప ఉన్నారు. మద్యానికి బానిసైన అప్పలరెడ్డి నిత్యం మద్యం తాగుతూ ఇంటికి వచ్చేవాడు. ఈ క్రమంలో భార్య ఎర్రమ్మ మందలించడంతో మనస్తాపం చెంది సమీపంలోని ఓ లేఅవుట్‌లో బుధవారం చెట్టుకు ఉరేసుకున్నాడు. స్థానికుల సమాచారంతో భోగాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోరపాడు సమీపంలోనే ఏనుగులు

సీతంపేట: గడిచిన వారం రోజులుగా నాలుగు ఏనుగుల గుంపు గోరపాడు సమీపంలో తిష్టవేసింది. దీంతో గిరిజనులు భయాందోళన చెందుతున్నారు. కొండపోడు వ్యవసాయంలో పండిస్తున్న పైనాపిల్ పండ్లను ఏనుగులు తినేస్తున్నాయని వాపోతున్నారు. పోడు పనులకు సైతం అటువైపు వెళ్లడం లేదని గిరిజనులు తెలిపారు. అటవీశాఖ సిబ్బంది ఏనుగుల గమనాన్ని పరిశీలిస్తున్నారు. ఏనుగులు తిరిగే వైపు వెళ్లవద్దని గిరిజన రైతులకు సూచిస్తున్నారు.

ప్రకటన

విజయనగరం వంటితాడి అగ్రహారం సర్వే నెం. 109/4, 114/2ల్లో భాగమైనటువంటి ప్లాట్ నెం.18, 444.4చ॥గ॥లు స్థలములో నిర్మించబడిన శ్రీసాయి నివాస్, ఫస్టు ఫ్లోర్, Flat No. 202,1320 Sq-yards+ కారు పార్కింగ్ 80 చ॥అ॥లు (కామన్ ఏరియాతో సహా రెసిడెన్షియల్ పోర్షన్, విశాఖపట్నం వాస్తవ్యులు జక్కంపూడి చిన్నారావు గారి కుమారుడు J.శ్రీనివాసరావు ఇతని భార్య లలిత (డెవలపర్స్) సైట్ ఓనర్ అయిన ముడిగంటి వివేకవర్ధిని తరపున GPA మరియు ఏజెంటు అయిన జక్కంపూడి శ్రీనివాసరావు ఇతని భార్య లలిత విజయనగరం జిల్లా, జామి మండలం, కుమరాం గ్రామం వాస్తవ్యురాలు చిట్టిలోని రవి భార్య గౌతమి అమ్మజూపి అందుకు రూ.32,50,000/- క్రయధనం నిర్ణయించుకొని, రూ.50,000/- అడ్వాన్స్ తీసుకొని తే26.06.2025దిని ఒక క్రయపురోణి వ్రాయించుకొనియున్నారు. కావున ఇతరులెవ్వరికైన ఎటువంటి ఆక్షేపణలు యున్న యెడల ఈ ప్రకటన లగాయితూ వారం రోజులలో క్రింది సుదహరించిన న్యాయవాది గారికి తెలియపరచవలెను.

సం/- ఎ.హరీష్
న్యాయవాది
MIG-100, అలకనందకాలనీ,
కంటోన్మెంట్, విజయనగరం
సెల్: 9849944618, 9494333319

IN THE COURT OF THE SPECIAL TRIBUNAL CONSTITUTED UNDER THE LAND GRABBING & PROHIBITION ACT (PRINCIPAL DISTRICT JUDGE) AT HANUMAKONDA

IN L.G.O.P.NO. 2 OF 2022
(old) L.G.O.P.NO. 1010 OF 2016

Between :
Samala Damodar (Died) per L.Rs & Others ... Petitioners
And
Alluri Murthy Raju & Others ... Respondents

To
1: Alluri Suryavathi, D/o. Alluri Murthy Raju, W/o. Ch. Venkatapathi, Aged: 51 years, Occu: Business, R/o. Maharaja Vidya Vygnana Kendram (MIMS), Nellimarla, Vijayanagaram District (Respondent No. 173)
2: Alluri Padmavathi, D/o Alluri Murthy Raju, W/o P. Vajaya Balarama Raju, Aged: 48 years, Occu: Business, R/o. Maharaja Vidya Vygnana Kendram (MIMS), Nellimarla, Vijayanagaram District (Respondent No. 174)
3: Alluri Satyanarayana Raju, S/o Alluri Murthy raju, Aged: 47 years, Occu: Business, R/o. Maharaja Vidya Vygnana Kendram (MIMS), Nellimarla, Vijayanagaram District (Respondent No. 175)
(Respondent No. 173 to 175 are L.Rs of deceased Respondent No. 1)


Pleased take notice that you have been impleaded as Respondent No. 173 to 175 as L.Rs of the Deceased Respondent No. 1 Late Alluri Murthy Raju. Inspite of summons sent to your above address to appear in the above L.G.O.P., you failed to receive the same. Thereon the application of the petitioners, the Hon'ble Court was pleased to order to issue notice by way of publication.


The above L.G.O.P.No. 2 of 2022 is posted on 17-7-2025 for your appearance, therefore, you are hereby required to appear on 17-7-2025 at 10.30 a.m., before the Hon'ble Court either in person or through an Advocate, failing which exparte orders will be passed against you by the Hon'ble Court.

//BY ORDER OF THE COURT//
Sd/- P. LAXMINARAYANA, B.Sc., B.L.,
Advocate
H.No. 1-7-1343, Road No. 6, Advocates Colony, Hanumakonda

తారకరామకు మోక్షమెప్పుడో?


నిర్మాణం నిలిచిపోయిన తారకరామ తీర్థసాగర్ స్పిల్‌వే


తారకరామ తీర్థ సాగర్ ప్రాజెక్టు వ్యయం, ఆయకట్టు ఎకరాల చిత్రం


చంపావతి నదీ పరీవాహక ప్రాంతంలోని తారక రామ తీర్థ సాగర్ బ్యారేజీ స్థాన చిత్రం

- 20 ఏళ్లయినా పూర్తికాని ప్రాజెక్టు పనులు
- రూ.804 కోట్లకు పెరిగిన నిర్వహణ వ్యయం
- పనుల్లో అంతులేని జాప్యం
- పట్టించుకోని ప్రభుత్వం

పూర్తి స్థాయిలో నిధులు విడుదల చేస్తేనే పనులు

కూటమి ప్రభుత్వంలో సరిపడా నిధులు వస్తేనే 2026 చివరికైనా తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు పనులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురాగలం. ఈ ప్రాజెక్టు ద్వారానే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి నీరందించాల్సి ఉంది. ప్రాజెక్టు వ్యయం రూ.804 కోట్లకు పెరగడంతో ఇప్పుడు ఈ ప్రభుత్వం విడుదల చేసే నిధులు ఏ కోశానా సరిపడవు. పై మొత్తం నిధులు విడుదలైతేనే 2026 డిసెంబర్ నాటికి విజయనగరం పట్టణానికి, భోగాపురం విమానాశ్రయానికే కాకుండా సుమారు 20 వేల ఎకరాలకు కూడా నీరందించగలం.
– అప్పలనాయుడు, తారకరామ తీర్థ సాగర్ ప్రాజెక్టు ఈఈ

విజయనగరం గంటస్తంభం: రెండు దశాబ్దాలుగా సాగుతున్న ప్రాజెక్టు తారకరామ తీర్థసాగర్. 2005 ఫిబ్రవరి 19న ప్రారంభించిన ప్రాజెక్టు అంచెలంచెలుగా అంచనా వ్యయం పెరుగుతోందే తప్ప పనులు మాత్రం పూర్తి కావడం లేదు. రాష్ట్రంలో 15 ఏళ్ల పాటు సీఎంగా బాధ్యతలు నిర్వర్తించిన చంద్రబాబునాయుడు ఏనాడూ ప్రాజెక్టు పూర్తికి చిత్తశుద్ధితో చర్యలు తీసుకోలేదు. ఉత్తరాంధ్రలో అత్యంత కీలకమైన ప్రాజెక్టును పూర్తి చేయడానికి గత వైఎస్ జగమోహన్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ ప్రాజెక్టులో అంతర్భాగమైన కుమిలి రిజర్వాయర్‌లో మిగిలిన పనులను రూ.150.24 కోట్లతో పూర్తి చేయాలని జలవనరుల శాఖ అధికారులకు ఆదేశాలిచ్చింది. ఈ ప్రాజెక్టు పూర్తయితే విజయనగరం జిల్లాలోని పూసపాటిరేగ, డెంకాడ, భోగాపురం మండలాల్లో గల 49 గ్రామాల్లోని 24,710 ఎకరాలకు సాగు నీరందుతుంది.

భూసేకరణే అసలు సమస్య..

తారకరామ తీర్థ సాగర్ ప్రాజెక్టుకు అవసరమైన 3497.58 ఎకరాల భూమికిగాను 3278.32 ఎకరాలను సేకరించారు. మిగతా 219.26 ఎకరాల సేకరణపై అధికారులు దృష్టిపెట్టారు. కుమిలి రిజర్వాయర్ ప్రాజెక్టులో కోరాడపేట, ఏటీ అగ్రహారం, పడాలపేట ముంపునకు గురవుతాయి. ఈ గ్రామాల్లోని 2,219 కుటుంబాలకు పునరావాసానికే రూ.209.88 కోట్లు అవసరం. అయితే ప్రభుత్వం తాజాగా కేవలం రూ.5కోట్లు మాత్రమే కేటాయించింది. తాడిపల్లి, కుదిపి, నీలంరాజు పేట గ్రామాల నిర్వాసితులకు పరిహారానికి రూ.75.69 కోట్లు ఖర్చవుతుంది. ప్రాజెక్టు పనులు పూర్తయ్యేలోగా నిర్వాసితులకు పునరావాసం కల్పించాల్సి ఉంది. నిర్వాసితులకు పునరావాసం కల్పించాక చంపావతి నుంచి నీటిని మళ్లించి, ఆయకట్టుకు నీళ్లందించడంతో పాటు విజయనగరం కార్పొరేషన్‌కు తాగునీరు సరఫరా అవకాశం కుదురుతుంది.

తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు ప్రాజెక్టు కీలకం

విజయనగరం పట్టణానికి తాగునీరు, భోగాపురం విమానాశ్రయానికి నీటి అవసరాలను తీర్చడమే కాకుండా సుమారు 20వేల ఎకరాలకు పైగా సాగు నీరు అందించే తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు నిర్మాణం ఎంతో అవసరం. ప్రాజెక్టుకు అరకొరగా నిధులు కేటాయించడంతో ఈ ఏడాది పనులు పూర్తయ్యే పరిస్థితి లేదు. మరి 2026 నాటికల్లా నీరు రాకుండా ఉంటే తాగునీరు సమస్య, అటు పారిశ్రామిక, విమానాశ్రయానికి నీరు లేక వెలవెలబోతుంది. ఎయిర్‌పోర్టు నిర్మాణం పూర్తయి అందుబాటులోకి వస్తే ఎయిర్‌పోర్టు అవసరాలకు తాగునీరు, వాడుక నీరు ప్రధానం కావున ఇందుకోసం తారకరామతీర్థ సాగర్ ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాల్సి ఉంది.

ప్రాజెక్టు నిర్మాణం ఇలా..

వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జలయజ్ఞంలో భాగంగా తారకరామ తీర్థ సాగర్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. విజయనగరం జిల్లా గుర్ల మండలం కోటగండ్రేడు వద్ద చంపావతి నదిపై 184 మీటర్ల పొడవున బ్యారేజీ నిర్మించి అక్కడి నుంచి 13.428 కిలోమీటర్ల కాలువ ద్వారా కుమిలిలో నిర్మించే రిజర్వాయర్‌కు 27 టీఎంసీల నీటిని మళ్లిస్తారు. ఇక్కడి నుంచి కుమిలి చానల్ సిస్టం పరిధిలోని 8,172 ఎకరాలను స్థిరీకరించడంతో పాటు కొత్తగా 16,538 ఎకరాలకు సాగునీందించాలి. వైఎస్సార్ మరణానంతరం అధికారంలోకి వచ్చిన పాలకులు ప్రాజెక్టు పనులు పట్టించుకోలేదు. 2014 నుంచి 2019 మధ్య పాలన సాగించిన చంద్రబాబునాయుడు ప్రాజెక్టు పనుల ఊసెత్తలేదు. అనంతరం అధికారం చేపట్టిన వైఎస్సార్ తనయుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రాజెక్టులో అంతర్భాగమైన బ్యారేజీ నిర్మాణాన్ని దాదాపు పూర్తిచేశారు. మళ్లింపు కాలువ, కుమిలి రిజర్వాయర్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. కుమిలి రిజర్వాయర్ డైక్–2, డైక్–3లలో 2.2 కిలోమీటర్ల మట్టికట్ట పనుల్లో రూ.150.24 కోట్ల పనులు మిగిలాయి. వాటిని చేపట్టిన కాంట్రాక్టర్ చేతులెత్తేశారు. దీంతో 60–సీ నిబంధన కింద కాంట్రాక్టర్‌ను తొలగించి, పనులను మరో కాంట్రాక్టర్‌కు అప్పగించడానికి అధికారులు సిద్ధమయ్యారు. ఆ మేరకు ప్రతిపాదనలను జ్యుడిషియల్ ప్రివ్యూకు పంపారు.

మత్స్యకారుల హాహాకారాలు


ప్రాజెక్టు ఒడ్డున అధికారులు

- మడ్డువలస ప్రాజెక్టులో చేపలవేటకు వెళ్లి గుర్రపుడెక్కలో చిక్కుకున్న మత్స్యకారులు
- కాపాడేందుకు రంగంలోకి దిగిన పోలీసులు, మత్స్యకారులు
- ప్రాజెక్టులో గాలింపు చర్యలు


ప్రాజెక్టులో మత్స్యకారుల గాలింపు చర్యలు

వంగర: మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టులో చేపలవేటకు వెళ్లిన ఇద్దరు మత్స్యకారులు గుర్రపుడెక్క మధ్యలో బుధవారం చిక్కుకున్నారు. వారిని బయటకు తెచ్చేందుకు పోలీసులు, మత్స్యకారులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. మెట్టమగ్గూరు గ్రామానికి చెందిన తండ్రీ కొడుకులు దాసరి రాములు, దాసరి ఆదినారాయణ బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో చేపలు వేటకు వెళ్లారు. ప్రాజెక్టులో దట్టంగా ఉన్న గుర్రపుడెక్క వీరిని చుట్టుముట్టడంతో పడవ ముందుకు సాగని పరిస్థితి. తండ్రీ కొడుకులు అందులో చిక్కుకోవడంతో తమను రక్షించాలంటూ ప్రాజెక్టు లోపలి భాగం నుంచి కేకలు వేస్తూ ఆర్తనాదాలు చేశారు. విషయం తెలుసుకున్న వంగర పోలీసులు హుటాహుటిన ప్రాజెక్టు వద్దకు చేరుకున్నారు. ఎగువ ప్రాంతాల్లో ఉన్న పట్టువర్ధనం గ్రామం నుంచి కొంతమంది మత్స్యకారులు, మగ్గూరు గ్రామం నుంచి కొంత మంది మత్స్యకారులను ఆరు పడవలతో ప్రాజెక్టు లోపలకు పంపించారు. కటిక చీకటి కావడంతో గుర్రపుడెక్కను తొలగించుకుంటూ వారి వద్దకు వెళ్లేందుకు చేసిన ప్రయత్నంలో అష్టకష్టాలు పడ్డారు. బాధితుల కేకలు వినిపిస్తున్నప్పటికీ దట్టంగా అల్లుకున్న గుర్రపుడెక్క కారణంగా వారి వద్దకు చేరుకునే పరిస్థితి కానరావడం లేదు. రాత్రి వరకు శ్రమించినప్పటికీ కటిక చీకటి కావడంతో పాజెక్టులో చిక్కుకున్నవారిని చేరుకునేందుకు తోటి మత్స్యకారులకు వీలు పడలేదు. అర్ధరాత్రి అయ్యేసరికి వారిని బయటకు తీసుకువస్తామంటూ బాధిత కుటుంబీకులకు పోలీసులు భరోసా ఇస్తున్నారు. మత్స్యకారులు చేస్తున్న ప్రయత్నాలు ఫలించి క్షేమంగా ఒడ్డుకు చేరుకోవాలని రాములు కుటుంబ సభ్యులు గంగమ్మతల్లిని ప్రార్థిస్తున్నారు.

3250 రేజీల రేషన్ బియ్యం పట్టివేత


అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పట్టుకున్న సీఐ అప్పలనాయుడు

సాలూరు: పట్టణంలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పట్టణ పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఈ మేరకు సీఐ అప్పలనాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పెద్ద బజార్‌లో గల బుద్దెపు సురేష్ దుకాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన 75 బియ్యం బస్తాల్లో సుమారు 3,250 కేజీల రేషన్ బియ్యం పట్టుకున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి తక్కువ ధరకు ఈ బియ్యం కొని, బయట ఎక్కువ ధరకు అమ్ముతానని నిందితుడు తెలిపినట్లు సీఐ పేర్కొన్నారు. పట్టుకున్న బియ్యాన్ని పట్టణ సివిల్‌సప్లయిస్ అధికారులకు తదుపరిచర్యల నిమిత్తం అప్పగించామని తెలిపారు.

వెబ్‌సైట్‌లో స్పీకింగ్ ఆర్డర్స్ జాబితా

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రుల్లో 20 కేటగిరిల్లో 91 ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వగా అందులో 12 కేటగిరిలకు సంబంధించిన పోస్టుల స్పీకింగ్ ఆర్డర్స్ జాబితాను విజయనగరం.ఏపీ, జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. పద్మలీల తెలిపారు. స్పీచ్ థెరపిస్టు, కంప్యూటర్ పోగ్రామ్, సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్, నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్, పీఈటీ, జూనియర్ అసిస్టెంట్ కమ్ అసిస్టెంట్, లైబ్రరీ అసిస్టెంట్, ఎలక్ట్రీషియన్ గ్రేడ్–3, ల్యాబ్ టెక్నీషియన్, ఆఫీస్ సబార్డినేట్, జనరల్ డ్యూటీ అటెండెంట్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, పోస్టుల జాబితా వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు తెలిపారు.

వరకట్న వేధింపుల కేసులో ముగ్గురికి జైలుశిక్ష


కోర్టు తీర్పును వెల్లడిస్తున్న డీఎస్పీ గోవిందరావు

విజయనగరం క్రైమ్: నాలుగేళ్ల క్రితం విజయనగరంలోని దిశ పోలీస్ స్టేషన్‌లో నమోదైన వరకట్నవేధింపుల కేసులో ముగ్గురు ముద్దాయిలకు విజయనగరం స్పెషల్ మొబైల్ కోర్ట్ బుధవారం జైలు శిక్ష విధించినట్లు మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ గోవిందరావు తెలిపారు. 2021లో విజయనగరం మహిళా పోలీస్‌స్టేషన్‌లో నమోదైన వరకట్న వేధింపుల కేసులో ముద్దాయిలు ముగ్గురికి ఒక ఏడాది సాధారణ జైలు, రూ.51వేల జరిమానా విధిస్తూ విజయనగరం జేఎఫ్‌సీఎం (స్పెషల్ మొబైల్ కోర్టు) న్యాయమూర్తి కుమారి పి.బుజ్జి తీర్పు వెల్లడించినట్లు డీఎస్పీ ఆర్.గోవింద రావు చెప్పారు. ఈ కేసు వివరాలిలా ఉన్నాయి. జిల్లాలోని నెల్లిమర్ల మండలం చినబూరాడపేటకు చెందిన యడ్ల మహాలక్ష్మికి గజపతినగరానికి చెందిన ఎన్ని రామకృష్ణతో 2019లో వివాహం జరిగింది. పెళ్లి సమయంలో రూ.8 లక్షల కట్నం, 4 తులాల బంగారు ఆభరణాలు, రూ.50వేల సారె సామాన్లు కానుకగా కన్నవారు ఇచ్చారు. వివాహం అనంతరం భర్త ఎన్ని రామకృష్ణ, అతని తల్లిదండ్రులు చిన్నయ్య, సత్యవతిలు అదనంగా మరో రూ.2 లక్షలు కట్నంగా తీసుకురావాలని మహాలక్ష్మిని శారీరకంగా, మానసికంగా వేధించడంతో బాధితురాలు మహిళా పోలీస్‌స్టేషన్‌లో 2021లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు అప్పటి మహిళా పీఎస్ ఎస్సై బి.గణేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేసి, నిందితులను అరెస్టు చేసి, కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. కోర్టు విచారణలో భర్త ఎన్ని రామకృష్ణ (ఎ1), అత్త ఎన్ని సత్యవతి (ఎ2), మామ ఎన్ని చిన్నయ్య (ఎ3) వరకట్న వేధింపులకు పాల్పడినట్లు రుజువు కావడంతో ముద్దాయిలకు పై విధంగా శిక్ష విధిస్తూ స్పెషల్ మొబైల్ కోర్టు న్యాయమూర్తి పి.బుజ్జి తీర్పు వెల్లడించారని డీఎస్పీ వివరించారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని జరజాపుపేట గ్రామానికి చెందిన ఓ యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై గణేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని మరో గ్రామానికి చెందిన బాలికను ఇంటర్ చదివే సమయంలో పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా అనుభవించి మోసం చేశాడని బాధిత బాలిక ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఫిర్యాదు ఆధారంగా దర్యాప్తు చేపడతామని పేర్కొన్నారు.

కేజీబీవీలో అగ్నిప్రమాదంపై ఫైర్ ఆడిట్

- విద్యార్థులు ఆందోళన చెందొద్దు
- సోమవారానికి పూర్తిస్థాయిలో తరగతుల ప్రారంభం
- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్
- కేజీబీవీని సందర్శించి దుర్ఘటనపై ఆరా


అగ్నిప్రమాదం జరిగిన తీరును పాఠశాల ఎస్‌ఓ విజయ కుమారిని అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ అంబేడ్కర్


ప్రమాదం జరిగిన తరగతి గదులను పరిశీలిస్తున్న కలెక్టర్

కొత్తవలస: మండలంలోని అడ్డూరువానిపాలెం గ్రామం సమీపంలో గల కస్తూర్బా గాంధీ పాఠశాలలో మంగళవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంపై వెంటనే ఫైర్ ఆడిట్ నిర్వహించి, సాయంత్రం లోగా నివేదికను అందజేయాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యుత్, సమగ్రశిక్ష ఇంజినీర్ అధికారులు, జిల్లా ఫైర్ అధికారులను ఆదేశించారు. కేజీబీవీలోని తరగతి గదుల్లో మంగళవారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పాఠశాలను కలెక్టర్ బుధవారం సందర్శించారు. కాలిపోయిన తరగతి గదులను, సామగ్రి, చుట్టుపక్కల పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులతో మాట్లాడి జరిగిన ఘటనపై ఆరా తీశారు. ఉన్న విద్యార్థులకే వసతి సౌకర్యం లేక, తరగతి గదుల్లోనే భోజనం, పడుకోవడం వంటివి చేస్తున్నట్లు గుర్తించారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇంటర్ తరగతులకు అనుమతులు ఎలా ఇచ్చారని జిల్లా విద్యాశాఖ అధికారి మాణిక్యం నాయుడిని ప్రశ్నించారు. జిల్లాలోని అన్ని కేజీబీవీలకు ప్లస్ టూ అనుమతులు ఇచ్చామని ఆయన బదులిచ్చారు. దీంతో కలెక్టర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

యథావిధిగా మెగా పేరెంట్స్, టీచర్ సమావేశం

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సిబ్బంది అప్రమత్తంగా ఉండి ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాలనుంచి వెళ్లిపోయిన విద్యార్థులను వెంటనే రప్పించి తరగతులను యథావిధిగా ప్రారంభించాలని స్పష్టం చేశారు. విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పాఠశాలలో పరిస్థితులన్నీ బాగానే ఉన్నాయని విద్యార్థులందరూ పాఠశాలకు తిరిగి రావాలని కోరారు. గురువారం జరిగే మెగా పేరెంట్, టీచర్స్ సమావేశాన్ని యథావిధిగా నిర్వహిస్తామని ప్రకటించారు.సోమవారం నాటికి పూర్తిస్థాయిలో విద్యార్థులను పాఠశాలకు రప్పించాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలలోని ప్రస్తుతం పనులను సమగ్రశిక్ష ఏపీసీ డాక్టర్ రామారావు దగ్గరుండి నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ డి.కీర్తి, విద్యుత్‌శాఖ ఎస్ఈ లక్ష్మణరావు, డీఎంహెచ్ఓ జీవనరాణి, జిల్లా ఫైర్ అధికారి రామ్ కుమార్, ఎస్ఎస్ఏ ఈఈ హరిప్రసాద్, ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ స్వప్న, తహసీల్దార్ అప్పలరాజు, ఎంపీడీఓ రమణయ్య, ఎంఈఓలు శ్రీదేవి, బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.3 లక్షల విలువైన వెండి ఆభరణాలు స్వాధీనం

• సోంపేటకు చెందిన వ్యక్తి అరెస్ట్


సోంపేటకు చెందిన నిందితుడి నుంచి వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్న జీఆర్పీ సిబ్బంది

విజయనగరం క్రైమ్: స్థానిక రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫాం నంబర్ 3పై ఓ వ్యక్తి నుంచి వెండి ఆభరణాలను జీఆర్పీ సిబ్బంది బుధవారం స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి జీఆర్పీ ఎస్సై బాలాజీరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా సోం పేటకు చెందిన ప్రవీణ్ సింగ్ ఒక బ్యాగ్‌లో సుమారు రూ.3 లక్షలు విలువ చేసే పది కేజీల వెండి ఆభరణాలను పట్టుకెళ్తున్నట్లు సమాచారం అందగా శ్రీకాకుళం నుంచి విజయనగరం వచ్చే రైలులో దిగిన ప్రవీణ్‌ను పట్టుకుని విచారణ చేయగా పొంతన లేని సమాధానాలు ఇచ్చాడు. దీంతో తమదైన శైలిలో విచారణ చేసి రవాణా చేస్తున్న ఆభరణాలకు ఎలాంటి రుసుము, ఆధారాలు లేకపోవడంతో వెంటనే అదుపులోకి తీసుకున్నామని జీఆర్పీ ఎస్సై బాలాజీరావు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

గంజాయి, పోక్సో కేసులపై దృష్టి పెట్టండి

• నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ ఆదేశాలు


సమావేశంలో కేసుల పురోగతిని తెలుసుకుంటున్న ఎస్పీ వకుల్ జిందల్ , ఏఎస్పీ సౌమ్యలత

విజయనగరం క్రైమ్: పెరుగుతున్న గంజాయి కేసుల నివారణపై దృష్టి పెట్టాలని ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు. ఈ మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని అన్ని స్టేషన్ల హౌస్ ఆఫీసర్లు, మూడు డివిజన్ల అధికారులతో ఎస్పీ వకుల్ జిందల్ బుధవారం నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. దర్యాప్తులో ఉన్న గ్రేవ్, నాన్‌గ్రేవ్, ఎన్డీపీఎస్, పోక్సో, అట్రాసిటీ, మిస్సింగ్, రోడ్డు ప్రమాదాల కేసులను, లాంగ్ పెండింగ్ కేసులను ఈ సందర్భంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ ప్రజలకు శక్తి యాప్ గురించి అవగాహన కల్పించాలని ఇందుకు శక్తి టీమ్స్ మరింత విస్తృతంగా పని చేయాలని ఆదేశించారు. కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థినులకు సెల్ఫ్ డిఫెన్సు టెక్నిక్స్ నేర్పించేందుకు శక్తి వారియర్స్ టీమ్స్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని చెప్పారు.

ఫిర్యాదు దారులతో మర్యాదగా ప్రవర్తించాలి

మహిళలపై జరిగే అఘాయిత్యాలపై పోలీస్‌స్టేషనుకు వచ్చే ఫిర్యాదులపై వెంటనే కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలని, స్టేషన్‌లో ఫిర్యాదుదారులు వేచి ఉండకుండా చూడాలని సూచించారు. గంజాయి అక్రమ రవాణ నియంత్రణపై దృష్టి పెట్టాలని, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నాలుగు చెక్ పోస్టుల వద్ద నిరంతరం వాహన తనిఖీలు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. అనంతరం పలు కేసుల్లో శాఖాపరంగా ప్రతిభ కనబర్చిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ వకుల్ జిందల్ ప్రత్యేకంగా అభినందించి, ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. సమావేశంలో అదనపు ఎస్పీ పి. సౌమ్యలత, విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, బొబ్బిలి డీఎస్పీ జి.భవ్యరెడ్డి, చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు, మహిళా పిఎస్ డీఎస్పీ ఆర్.గోవిందరావు, డీటీసీ డీఎస్పీ ఎం.వీరకుమార్ ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర కీర్తిని నిలిపిన నేత

- జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించిన 'బొత్స'
- ఘనంగా బొత్స జన్మదిన వేడుకలు


మెడికల్ క్యాంప్‌ను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్


బొత్స జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉత్తరాంధ్ర కీర్తిని ఇనుమడింపజేసిన ఘనత శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణకు దక్కిందని, విశాఖపట్నం నుంచి హైదరాబాద్ వరకు ఉత్తరాంధ్ర పేరు చెబితే బొత్స గుర్తుకొచ్చే విధంగా పరిపాలన సాగించారని జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ, పీఏసీ మెంబర్ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ జన్మదినోత్సవాన్ని బుధవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పట్టణంలోని ఓ కల్యాణ మంటపంలో వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మెగా మెడికల్ క్యాంప్‌ను ప్రారంభించిన అనంతరం కేక్ కట్ చేశారు. అనంతరం హ్యాపీ బర్త్‌డే బొత్స అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాను ఎంతో అభివృద్ధి పథంలో నడిపించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే తిరుగులేని నాయకుడిగా ఎదిగిన బొత్స నాయకత్వంలో పని చేస్తున్నందుకు గర్వపడాలన్నారు.

మెడికల్ క్యాంప్‌లో 350 మందికి వైద్య పరీక్షలు

ఇదిలా ఉండగా 'బొత్స' జన్మదినం సందర్భంగా నిర్వహించిన మెగా మెడికల్ క్యాంప్ విజయవంతమైంది. శ్రీకాకుళానికి చెందిన జెమ్స్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది హాజరై వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన 350 మంది హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీతో శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానానికి వెళ్లి పూజలు నిర్వహించారు. బాపూజీ వృద్ధాశ్రమంలో వృద్ధులకు భోజనాలు పెట్టించి, ప్రభుత్వ రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విజయనగరం పార్లమెంటరీ పరిశీలకుడు కిల్లి సత్యనారాయణ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్‌లు ఎస్‌వీ.రమణరాజు, కేవీ.సూర్యనారాయణరాజు, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్పిలి అనంతం చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం మండలాల పార్టీ అధ్యక్షులు మీసాల వరహాలనాయుడు, మీసాల విశ్వేశ్వరరావు, కోట్ల వెంకటరావు, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి దన్నాన జనార్దనరావు, నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, వలంటీర్ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లాన త్రినాథరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డెస్‌డ్	స్కిన్‌లెస్
₹95	₹160	₹170

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ కన్సల్టెన్సీ కాదు.VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవ డానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP& డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం. Hyd.9014885406 [HA-15968]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.